క్లుప్తంగా

ఐదు వేల మందికి అన్నసమారాధన



పెనమలూరు: పోరంకిలో ఐదువేల మందికి అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఉన్న పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామివారి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు చివరి రోజు శుక్రవారం ఆలయంలో దాదాపు ఐదువేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. ఆలయంలో మహా పూర్ణాహుతి, వసంతోత్సవం, కొట్నాలు, చక్ర స్నానం, సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం, ఆరగింపులు, పవళింపు సేవ పూజలు నిర్వహించారు. గత నాలుగు రోజులుగా జరిగిన బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

కాలుష్య నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత



కంకిపాడు: కాలుష్య నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కళాకారుల బృందం సూచించింది. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విజయవాడ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయ పర్యవేక్షణలో మిషన్ లైఫ్‌లో భాగంగా అమరావతి కల్చరల్ ఆర్గనైజేషన్, గుడివాడ కళాకారుల బృందం శుక్రవారం కంకిపాడులో పలు చోట్ల కళా ప్రదర్శనలు ఇచ్చారు.

ఎద్దులను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తుల అరెస్టు

గన్నవరం: అక్రమంగా లారీలో ఎద్దులను తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను గన్నవరం పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయనగరంలో పశువుల సంతలో కొనుగోలు చేసిన 43 ఎద్దులను లారీలో చిలకలూరిపేటకు తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ శ్రీనివాస్, సిబ్బంది గన్నవరం కొత్తపేట వద్ద లారీని అడ్డుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. లారీని సీజ్ చేసి ఎద్దులను సంరక్షణ నిమిత్తం గుంటూరుకు తరలించినట్లు పేర్కొన్నారు.

మరింత సులభతరంగా రిజిస్ట్రేషన్ సేవలు

- ఈ-స్టాంపింగ్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలి
- స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్, ఐజీ వి.రామకృష్ణ
- కంకిపాడు సబ్ రిజిస్ట్రారు కార్యాలయం సందర్శన



కంకిపాడు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో సమీక్షిస్తున్న స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ రామకృష్ణ

కంకిపాడు: రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా సేవలు మరింత సులభతరంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్, ఐజీ వి.రామకృష్ణ అన్నారు. కంకిపాడు సబ్ రిజిస్ట్రారు కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రిజిస్ట్రేషన్‌లలో సులభతరమైన విధానం ప్రజలకు చేరువ చేసే నూతన విధానాన్ని ప్రవేశపెట్టే విషయంపై అధికారులు, సాంకేతిక సిబ్బందితో సమీక్షించారు. సాంకేతిక విధి విధానాలను రూపొందించటంపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరింత సమర్థంగా రిజిస్ట్రేషన్ సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాన్ జ్యుడిషియల్ స్టాంపులు ప్రజలకు చేరవేసేందుకు అనువుగా ఈ-స్టాంపింగ్ విధానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. నాన్ జ్యుడిషియల్ స్టాంపులకు ప్రత్యామ్నాయంగా ఈ-స్టాంపులను వినియోగించుకోవాలన్నారు. ఈ-స్టాంపుల ప్రాధాన్యత, ప్రయోజనాలను ప్రజలకు తెలియజెప్పి అవగాహన కల్పించాలన్నారు. రిజిస్ట్రేషన్ సేవలు త్వరితగతిన అందించాలని, సేవలు పారదర్శకంగా ఉండాలని సూచనలు ఇచ్చారు. పరిశీలనలో జాయింట్ ఐజీ 2 టి.సరోజ, ఏఐజీ జేయూఎన్ జయలక్ష్మి, జిల్లా రిజిస్ట్రారు ఎస్.రాంకుమార్, సబ్ రిజిస్ట్రారు ఎన్.ఎన్.వీ.త్రినాథ్‌రావు, సాంకేతిక బృందం పాల్గొన్నారు.

రక్త సేకరణలో జాగ్రత్తలు పాటించాలి



స్టాఫ్ నర్సులతో కళాశాల డీజీ డాక్టర్ సి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ రంగారావు తదితరులు

గన్నవరం రూరల్: దాతల నుంచి రక్తం సేకరించేటప్పుడు డ్రగ్ అండ్ కాస్మెటిక్ చట్టం ప్రకారం అన్ని జాగ్రత్తలు పాటించాలని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ సి.నాగేశ్వరరావు చెప్పారు. కళాశాలలో ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ(ఏపీసాక్స్) ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరుగుతున్న రాష్ట్రస్థాయి ప్రభుత్వ బ్లడ్ సెంటర్‌ల స్టాఫ్ నర్సుల అవగాహన సదస్సు లో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 43 ప్రభుత్వ సెంటర్ల స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బ్లడ్ ఎక్కించే ముందు ఇన్ఫెక్షన్లు పరిశీలించుకోవాలని చెప్పారు. ఏపీ సాక్స్ జేడీ డాక్టర్ కిషోర్ పర్యవేక్షణలో జరుగుతున్న కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రంగారావు, హెచ్‌ఓడీ డాక్టర్ నవీన్ చంద్రరావు, ప్రొఫెసర్ కల్యాణ్ చక్రవర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు జాస్మిన్ సుల్తానా, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియాను పారదోలుదాం

ఉయ్యూరు: పరిసరాల పరిశుభ్రతతో మలేరియాను పారదోలుదామని కాటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జి.దీప అన్నారు. మండలంలోని బోళ్లపాడు గ్రామంలో మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ దీప మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిల్వ నీటి ప్రదేశాలను లేకుండా చూసుకుంటే దోమల ఉత్పత్తి నిర్మూలన సాధ్యమేనన్నారు. జ్వరం రాగానే వైద్యులను సంప్రదించి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ తుమ్మూరు సురేష్‌రెడ్డి, ఎంపీటీసీ తుమ్మూరు గంగారత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

జీవన్‌దాన్‌తో పునర్జన్మ

గన్నవరం రూరల్: ఏపీ జీవన్‌దాన్ ద్వారా మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ వైద్యులు ఒకరికి పునర్జన్మ ప్రసాదించారు. కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ సి.నాగేశ్వరరావు శుక్రవారం వివరాలను తెలియజేస్తూ గత నెల 17న విజయవాడ పటమటకు చెందిన దేవరాజు గట్టు సాంబశివరావు స్పృహ కోల్పోగా బంధువులు ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆయనకు బ్రెయిన్ డెడ్ కావటంతో రక్త సంబంధీకులు అవయవదానానికి ముందుకు వచ్చారు. ఏపీ జీవన్‌దాన్ ద్వారా ఇదే ఆస్పత్రిలో కె.రవిబాబుకు కిడ్నీని అమర్చారు. కిడ్నీ సర్జరీని పిన్నమనేని వైద్య బృందం వరుణ్, సింధు, సూర్యకుమారి, బాలమురళీకృష్ణ, పవన్‌సాయి, గోవర్ధిని, దీప్తి విజయవంతంగా నిర్వహించారు.

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు

కంకిపాడు: వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా తెన్నేరు శాఖా గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. చిన్నారులు పలు ఆసక్తికరమైన చిత్రాలను గీసి ప్రదర్శించారు. పోటీల్లో గ్రామ పరిధిలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలను గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో నీతి కథలను చదివే పోటీలను నిర్వహించారు. పోటీలను గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ, రైల్వే సూపరింటెండెంట్ కటికల రాంబాబు పర్యవేక్షించారు.

గన్నవరం రూరల్: పురుషోత్తపట్నం శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ కె.కృపానందం తదితరులు పాల్గొన్నారు. ముస్తాబాద శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి ఆధ్వర్యాన విద్యార్థులకు యోగా, చెస్ పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు.

ఉయ్యూరు: పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా శుక్రవారం గ్రంథాలయాధికారి బి.రమణి కథల పుస్తకాలను చదివించారు. విద్యార్థులతో జాతీయ గీతాలు పాడించి యోగాసనాలు వేయించారు. రిసోర్సు పర్సన్ కోటేశ్వరరావు పలు పాఠ్యాంశాలపై బోధన చేశారు.

బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలి మృతి

గన్నవరం: బార్ అసోసియేషన్ ఆఫ్ గన్నవరం శాఖ ఉపాధ్యక్షురాలు దాసరి భాగ్యలక్ష్మి(45) గురువారం రాత్రి కన్నుమూశారు. రామేశ్వరం యాత్ర నిమిత్తం రైలులో వెళ్తుండగా చెన్నై దాటిన తర్వాత ఆమెకు తీవ్ర గుండెపోటు రావడంతో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భాగ్యలక్ష్మి మృతదేహాన్ని శుక్రవారం స్వగృహానికి తీసుకువచ్చారు. ఆమె భౌతికకాయాన్ని సందర్శించిన సబ్ కోర్టు జడ్జి జయలక్ష్మి, 12వ ఏఎంఎం కోర్టు జడ్జి శిరీష, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, ఎంపీపీ అనగాని రవి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు తిరివీధి వెంకయ్య, ప్రధాన కార్యదర్శి జాస్తి తాతారావు తదితరులు నివాళులర్పించారు. ఆమె భర్త న్యాయవాది విమల్ కుమార్, కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

పోషకాహారంపై అవగాహన

ఉంగుటూరు: పోషకాహారంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. మిషన్ లైఫ్ ప్రచారంలో భాగంగా శుక్రవారం ముక్కపాడులో పోషక విలువలు ఉన్న ఆహారాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువు పనుల పరిశీలన

గన్నవరం రూరల్: గోపవరపుగూడెం గ్రామంలో జరుగుతున్న ఆజాదికా అమృత్ సరోవర్ మంచి నీటి చెరువు బాగుజేత పనులను శుక్రవారం సర్పంచ్ నల్లూరు వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఏపీవో సత్యప్రియ, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందిపాల్గొన్నారు.

సామాజిక పింఛన్లతో ఆసరా



దయాలసిస్ రోగికి పింఛను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని

ఉయ్యూరు: సామాజిక పింఛన్లు పేదలకు ఆసరాగా నిలుస్తున్నాయని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని అన్నారు. మున్సిపాలిటీలో పింఛన్ల పంపిణీ రెండో రోజైన శుక్రవారం కూడా కొనసాగింది. చైర్మన్ వల్లభనేని నాని డయాలసిస్ రోగికి రూ.10 వేలు పింఛను అందజేసి, పింఛన్ల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 20 వార్డుల్లో 97 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యిందన్నారు. నూరు శాతం పంపిణీ లక్ష్యంగానే వలంటీర్లు పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రతినెలా ఠంచనుగా పింఛను అందిస్తున్న సొమ్ము పేద కుటుంబాలకు ఆసరాగా మారిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డయాలసిస్ రోగులకు ప్రతి నెలా రూ.10 వేలు అందిస్తున్న సొమ్ము వైద్య సేవలకు ఉపయోగపడుతుందని వివరించారు.

10న నాగపట్నానికి ప్రత్యేక బస్ సర్వీస్

గన్నవరం: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 10వ తేదీ వేళాంగిణి(నాగపట్నం)కు ప్రత్యేక బస్సు నడపనున్నట్లు డీఎం పి.శివాజీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు గన్నవరం బస్టాండ్ నుంచి బయలుదేరుతుందని పేర్కొన్నారు. 11వ తేదీ ఉదయం నాగపట్నం చేరుకుని వేళాంగిణి మాత దర్శనం, దివ్య బలిపూజ తర్వాత రాత్రి అక్కడే బస ఉంటుందని తెలిపారు. తిరిగి 12వ తేది ఉదయం నాగపట్నం నుంచి బయలుదేరి మధ్యాహ్నం చెన్నైకు చేరుకుని సెయింట్ థామస్ సమాధి సందర్శన, అదే రోజు మెరీనా బీచ్ సందర్శన తర్వాత రాత్రికి బయలుదేరి 13వ తేదీ ఉదయం 10 గంటలకు గన్నవరం చేరుకుంటుందని వివరించారు. యాత్ర టికెట్ ధర రూ. 3,400గా నిర్ణయించినట్లు తెలిపారు. ఇతర సమాచారానికి 8790996090, 7382905633 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఇనాం భూముల సాగుదారుల సమస్యలు పరిష్కరిస్తాం

గుడివాడ ఆర్డీవో పద్మావతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: వెంకటాపురం ఇనాం భూములను సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని గుడివాడ ఆర్డీవో పి.పద్మావతి అన్నారు. బాపులపాడు మండలం సిరివాడలో వెంకటాపురం ఇనాం భూముల సాగుదారులతో రెవిన్యూ అధికారులు శుక్రవారం సదస్సు నిర్వహించారు. దీర్ఘకాలంగా ఇనాం భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఈ భూములు సాగు చేస్తున్న పేద రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని ఆర్డీవో పద్మావతికి విజ్ఞప్తి చేశారు. బాపులపాడు తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధి, తదితరులు పాల్గొన్నారు.

రెండు వర్గాల మధ్య వివాదం!

హనుమాన్‌జంక్షన్ రూరల్: సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టింగులు హనుమాన్‌జంక్షన్‌లో రెండు వర్గాల మధ్య వివాదానికి దారితీశాయి. తెలిసిన వివరాల మేరకు బాపులపాడు మండలం పెరికీడుకు చెందిన ఓ యువకుడి జన్మదినం సందర్భంగా శుక్రవారం వాట్సాప్ గ్రూపులో మరో యువకుడు పెట్టిన పోస్టు రెండు వర్గాల మధ్య విభేదాలను సృష్టించింది. అది ఘర్షణకు దారితీసింది. విజయవాడ రోడ్డులోని మూలకొట్టు సెంటర్‌లో ఇరువర్గాల యువకులు అధిక సంఖ్యలో కర్రలతో వచ్చి గుమ్మిగూడటంతో ఉద్రికత్త చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను అదుపులోకి తీసుకున్నారు. పెరికీడుకు చెందిన కొత్తూరు సాగర్, బేతపూడి సురేష్ తమపై దాడి చేసి గాయపర్చారని వేలేరుకు చెందిన కమలాకర్, సాయి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాయాలైన ఇద్దరు యువకులు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేరారు.

రాయితీలు వినియోగించుకోవాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: పాడిరైతులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను వినియోగించుకోవాలని బాపులపాడు ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని అన్నారు. బాపులపాడులోని ప్రభుత్వ ప్రాంతీయ పశువైద్యశాల ప్రాంగణంలో పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గేదె, ఆవు లేగదూడల ప్రదర్శనను శుక్రవారం నిర్వహించారు. డీఎల్‌డీఏ ఈవో డాక్టర్ శ్రీనివాసులు, పశు సంవర్ధకశాఖ అధికారులు పాల్గొన్నారు.